


# బాసుదేవుడు

**వసుంధర**

నా బుర్ర గట్టిది. నా బుద్ధి మంచిది. అందుకే నేనంటే బాస్‌కు చాలా ఇష్టం. ఆయన చాలా మందికి చెప్పుకోలేని ఎన్నో విష యాలు నాకు చెబుతూంటాడు.

నేను సిన్సియర్‌గా పనిచేస్తాను. అవినీతికి దూరంగా ఉంటాను. అయితే నాలో నాయకత్వపు లక్షణాలు లేవు. అందుకే నేను ఇంటి పనులకు ఇల్లాలినుంచీ, ఆఫీసు పనులకు అధికారినుంచీ ఆర్డర్లు తీసుకుంటాను. ఈ రెండూ కాని వాటికి దేవుడిమీద ఆధారపడతాను.

భార్య, బాసు, దేవుడు - ఈ ముగ్గురూ నా ఆలోచనలనూ, చేతలనూ శాసించేవారే అయినా వీరిలో భార్య స్థాయివేరు. ఆమె నాకు బాసు. కానీ దాసినంటుంది. ఆమె నాకు దేవత. కానీ నన్ను దేవుడంటుంది. ఎవరు ఏమిటీ అన్న మీమాంసలో లోతుగా వెడితే ఇద్దరికీ అభేదం గోచరిస్తుంది. అందుకని నేనెప్పుడు చెప్పినా బాసు, దేవుడి గురించి మాత్రమే ఉంటుంది.

బాసు చాలా మంచివాడు. ఆయనకు అతిశయం లేదు. అహంకారం లేదు. చప్రాసీతో భుజాన చేతులు వేసి చరించగలడు. బండబూతులు తిట్టినవాడిని నవ్వుతూ పలకరించగలడు. ఆయన నుంచి నేను ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నాను.

ఆయనకు అవినీతి అంటే అసహ్యం. కానీ ఆఫీసులో ఆయన చుట్టూ తిరిగేది అవినీతిపరులే. ఆయనకు పొగడ్తలంటే చిరాకు. రోజులో సగభాగం ఆయనకు వారి పొగడ్తలు వినడంతోనే సరిపోయేది. ఆయనకు క్రమశిక్షణ ప్రాణం. కానీ ఆయన బాసుగా వచ్చేక ఆఫీసులో క్రమశిక్షణ దారుణంగా పడిపోయింది.


బాసు నన్ను చేరదియ్యడం చాలామందికి ఆశ్చర్యమనిపించింది. అయితే చాలా ఏళ్ళుగా నన్నెరిగినవారు కూడా, "అమ్మో అలా కనపడతాడు కానీ...." అనుకుందుకే సిద్ధపడ్డారు తప్ప బాసు మంచివాళ్ళనూ చేరదీస్తాడని నమ్మాలనుకోలేదు.

నేను పరిచయమైన వారం రోజుల్లోనే బాసు నాతో, "మన దేశంలో అధికారం అత్యంత ప్రమాదకరమైనది. అది మనుషుల్ని మార్చేయగలదు. అది ఉన్నవారిని మనుషులు మార్చేయగలరు. నాలో నాకు తెలియకుండా వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు చెబుతూంటావని నిన్ను చేరదీస్తున్నాను. నీ బుర్ర గట్టిది. నీ బుద్ధి మంచిది. అందుకే నువ్వంటే నాకిష్టం-" అన్నాడు. నేను కామోసనుకున్నాను.

నిజానికిది నాకో మహత్తర అవకాశం. నా బుద్ధి ఎంత మంచిదో చెప్పలేనుకానీ నా చుట్టూ ఉన్నవారందరూ నాకంటే ఎక్కువ సుఖపడాలని ఎన్నోసార్లు నేను దేవుణ్ణి ప్రార్థించాను. నా బుర్ర ఎంత గట్టిదో తెలియదు కానీ ఉయ్యాల్లో పిల్లాణ్ణుంచుకొని ఊరంతా వెదికినట్లు మన చేతిలోనే పరిష్కారమార్గాలుంటే సమస్యల గురించి ఎక్కడెక్కడో చర్చిస్తామన్న విషయాన్ని ఇతివృత్తం చేసుకుని నేను వ్రాసిన ప్రతి కథా ప్రచురణకు నోచుకుంది. నా ప్రార్థనలు, కథలు పెద్దగా ఫలితం సాధించినట్లు కనపడదు. కానీ బాస్ నాకిచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటే కనీసం కొందరికి ప్రత్యక్షంగా సాయపడిన వాడినౌతాననిపించింది.

బాసు తరచుగా మెచ్చుకొనే వ్యక్తుల్లో శంకరం ఒకడు. ఆ శంకరం ఉత్త అసమర్థుడని నాకు తెలుసు. బాసు ఆయనకు చాలా పెద్ద బాధ్యతలే అప్పజెప్పడంవల్ల ఆఫీసులో కొన్ని వ్యవహారాలు కుంటినడక నడుస్తున్నాయి. నేనా విషయం బాసు దృష్టికి సోదాహరణంగా తీసుకుని వచ్చాను.

"నీలో నిజాయితీ ఉందని తెలుసు నాకు. కానీ మనిషికి దేవుడు చేతులిచ్చింది చప్పట్లు కొట్టడానికే తప్ప వేళ్ళు చూపడానికి కాదని నా నమ్మకం. చేతనైనంతలో మనం ఎదుటివాడిలో గొప్పతనాన్ని




చూడాలి. చెడు ఉంటే విస్మరించాలి-" అన్నాడు బాసు.

బాసు ఎప్పుడూ ఎవరినీ దేనికీ తప్పుపట్టడు. ప్రతి ఒక్కనినీ దేనికోదానికి మెచ్చుకుంటూనే ఉంటాడు. ఆయన ఆదర్శం గొప్పది. ఆ విషయమే ప్రస్తావిస్తూ, "అయినప్పటికీ శంకరం అసమర్థతను గుర్తించకపోతే ఆఫీసు నష్టపోతూంది - " అన్నాను.

బాసు నవ్వుతూనే, "నా ఆదర్శాలను మరీ అంతలా మెచ్చుకోకు. భగవంతుడు భక్త సులభుడంటారు కదా! నేను మానవమాత్రుణ్ణి. నాలో ఓ గొప్ప బలహీనత ఉంది. నాకిష్టులైన వారి గురించి చెడు వింటే నాలో కోపం కట్టలు తెంచుకుంటుంది-" అన్నాడు.

నా బుర్ర గట్టిది. విషయం తెలుసుకున్నానని కాక హెచ్చరికగా అర్థం చేసుకోగలిగాను.

బాసు తరచుగా నా రచనాశక్తిని మెచ్చుకుంటూండేవాడు. ఆయన తను తయారు చేసిన నోట్సుని నాకు చూపించి అభిప్రాయ మడుగుతూండేవాడు. నేను చదివి బాగుందని మెచ్చుకునేవాణ్ణి. ఆయనకు అదంతగా తృప్తిని కలిగించినట్లు లేదు. ఒక రోజున, "నువ్వు నన్ను బాసులాగే చూస్తున్నట్లుంది. ఈసారి నేనిచ్చిన నోట్సుని నీ రూంకి తీసుకెళ్ళి ఎలా మార్చితే బాగుంటుందో అలా వ్రాసి తెచ్చి నాకు చూపించు-" అన్నాడు.

ఆయన మాటల్లో నిజాయితీ ధ్వనించింది. నేను బాసిచ్చిన రెండు పేజీల నోట్సును తీసుకున్నాను. నారూంలో శ్రద్ధగా చదివాను. చెప్పిన పాయింటే మళ్ళీ మళ్ళీ చెప్పినట్లు తోచి మొత్తం విషయాన్ని పది పంక్తులకు కుదించి వ్రాశాను. బాసు నా నోట్సు చూసి, "ఏమిటిది?" అన్నాడు.

ఆయన ముఖం అదోలాగైపోయింది.

"మీరు వ్రాసిన మేటర్ అంతా ఆ పది పంక్తుల్లోనూ ఉంది-" అన్నాను.

"బాలమురళి సామజవరగమనా అని మూడు గంటలు పాడితే ఎస్. జానకి మూడు నిముషాల్లో తేల్చేసింది. దేవుడిముందు శాస్త్రీయం వదిలి లలితం పెట్టాలంటావా?" అన్నాడు బాస్.

"మీరడిగారని మార్చాను-" అన్నాను నొచ్చుకుంటూ.

"అడగడం నా మర్యాద...." అనడంతో ఆయన నా మర్యాద ఏమిటో చెప్పనే చెప్పినట్లయింది. ఆ తర్వాత నుంచి బాస్ నోట్సులను యధాతధంగా మెచ్చుకొని నా మర్యాదను నిరూపించుకోసాగాను.

ఇవన్నీ చిన్న చిన్న విషయాలు. బాస్‌తో నాకున్న పరిచయాన్ని ఇతరుల మేలుకోసం ఉపయోగించాలనుకున్నాను. ఆ వెనువెంటనే సుబ్బారావు గుర్తుకొచ్చాడు.

సుబ్బారావు తన పని చేసుకుపోతాడు. అదేదో డ్యూటీలా భావిస్తాడే తప్ప తన గురించి ప్రగల్భాలు పలుకడు. పెద్దవాళ్ళను మచ్చిక చేసుకోవడం అతడికి బొత్తిగా తెలియదు. అందువల్ల గత రెండేళ్ళుగా అతడికి డిపార్టుమెంటల్ ప్రమోషన్ రావడం లేదు. బాసు కూడా అతడి గురించి నా వద్ద నాలుగైదుసార్లు బాధపడి! "హి డిజర్వ్స్ బెటర్ ఫేట్-" అన్నాడు.

"సర్ - అతడి ఫేట్ మీ చేతుల్లో ఉంది-" అన్నాను ఒకసారి.

"సుబ్బారావు తన పని తను చేసుకుపోతాడు. కమిటీ తన పని చేసుకుపోతుంది. మధ్య నా చేతులెక్కణ్ణించి వచ్చాయి-" అన్నాడు బాసు కిసుక్కున నవ్వి.

బాసు కమిటీలో ఉండడు కానీ ఆయనేమనుకుంటే అదే కమిటీ చేస్తుందన్నది జగమెరిగిన రహస్యం. అయినా సుబ్బారావుకు ప్రమోషన్ రాలేదు. కారణం బాస్ ఆలోచనల్లో అతడికి స్థానం లేదు సరికదా ఆలోచనల్లో స్థానమున్న కొందరికతను అడ్డు. అయినా బాసు తలచుకుంటే ఎవరికీ అడ్డురాకుండా సుబ్బారావుకు ప్రమోషనివ్వగలడు. అదే నేను బాసు నుంచి కోరితే, "అందరూ అందరిగురించీ ఆలోచించలేరు. రాజకీయవాదుల దృష్టి వెనుకబడిన వారి మీదా, అల్ప సంఖ్యాకవర్గం మీదా మాత్రమే ఉందని దేశం ముందుకు పోవడం ఆగిందా?" అన్నాడాయన. కానీ అసలు కారణం నాకు అర్థమయింది. దేవుడంతటివాడికి కూడా గుర్తింపు బాధ వుంది. అందుకే ఆయన ఆలయాల్లో వెలసి దర్శనానికీ, పూజావిధులకూ నియమావళులేర్పరచి తనను గుర్తించిన వారిని గుర్తించే ఏర్పాటు చేసుకున్నాడు. ఆఫీసుకు సంబంధించినంత వరకూ సుబ్బారావు గుడికి వెళ్ళని భక్తుడు. అలాగని అతడికి నియమాలేం లేవు. అతడి జీవిత విధానమే అంత!

దేవుడు రాక్షసులకు వరాలివ్వడం వారు వరగర్వితులు కావడం పరిపాటి. దేవుడి ప్రతినిధి అయిన ఇంద్రుడు కూడా తరచుగా అధికార గర్వానికి లోబడి మునులనూ, పతివ్రతలనూ, మంచివారినీ ఇబ్బందిపెట్టి శాపాలకు గురై తిరిగి దేవుడి చేతనే రక్షించబడడమూ పరిపాటి. మా ఆఫీసులో ఈ రెండూ జరుగుతూండడంవల్ల యూనియన్ బలపడి బాసుకు ఎదురుతిరిగింది.

యూనియన్ కోర్కెలు కొన్ని న్యాయమైనవనీ వాటిని తీర్చడంవల్ల ఆఫీసుకు మేలు జరుగుతుందనీ నేను బాసుకి చెప్పాను. బాసు ఒప్పుకోలేదు. కోట్లాది ప్రజలు తిండిలేక బాధపడే ఈ దేశంలో ఉద్యోగస్థులు గొప్ప అదృష్టవంతులనీ దానితో తృప్తిపడనివారు ఆశాపాతకులనీ నిందించాడు. యూనియన్ని అణచివేయడం తన జీవితాశయమనీ అది నెరవేర్చుకోవడంలో ప్రజాసేవకు ఇబ్బంది వాటిల్లినా తప్పులేదనీ హుంకరించాడాయన.

బాసు కొందరు గట్టివాళ్ళకు ధనాశ చూపించాడు. కొందరికి ప్రమోషన్ ఎరగా వేశాడు. కొందరు పిరికివాళ్ళని సస్పెండు చేసి యూనియన్‌లోంచి బయటకు వస్తే వాళ్ళను కాపాడతానన్నాడు. ఆవిధంగా యూనియన్ ముక్కలైంది. స్థిరచిత్తులు ముగ్గురో నలుగురో మిగిలితే బాసు వాళ్ళను వేటాడ్డం ప్రారంభించాడు.




అప్పట్నించీ ఆఫీసు ప్రజాసేవను మరిచి రణరంగంగా మారింది. అతిరథ మహారథులై బాసు, యూనియన్ నాయకులు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. తాత్కాలికంగా విజయం బాసునే వరించినా కార్గిల్ విజయం కాశ్మీరు సమస్యను ఎక్కడుంచిందో - ఆ విజయమూ మా ఆఫీసునక్కడే ఉంచింది.

యూనియన్ నాయకులు నాకు బాగా తెలుసు. వాళ్ళు అనుసరిస్తున్న మార్గాలు సరైనవనలేను కానీ - వాళ్ళు నిజాయితీపరులనీ, దేశభక్తులనీ ఖచ్చితంగా చెప్పగలను. ఆఫీసులో చాలామంది స్టాఫ్‌కంటే వాళ్ళు సమర్థులనీ నాకు తెలుసు. యూనియన్ నాయకులైన కారణంగా వారిని అణగద్రొక్కడం వల్ల ఆఫీసుకే ఎక్కువ నష్టమని నేను బాసుకి వివరించాను. బాసు నా మాటలన్నీ నిజమేనని ఒప్పుకుని - "ఏం చేయమంటావో చెప్పు"- అన్నాడు.

యూనియన్ బలహీనపడింది. అందువల్ల నాయకులూ దిగివచ్చేలా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఆఫీసు ప్రగతిని దృష్టిలో ఉంచుకుని కొన్ని ఉపాయాలు అమలు చేయాలి. అందుకు బాసు కూడా అహాన్ని కాస్త పక్కకు నెట్టాలి.

"నువ్వు బాగానే చెప్పావు. ది లీడర్స్ డిజర్వ్ ఎ బెటర్ ఫేట్"- అన్నాడు బాసు. నేను ఎంతో సంతోషించాను. అయితే ఆయన నా మాటల్లోంచి యూనియన్ నాయకుల బలహీనతలను మాత్రమే ఏరుకుని వాళ్ళను మరో చావు దెబ్బ తీశాడు.

"ఇలా చేశారేమిటి సార్?" అన్నాను బాధగా.

"నేనున్న సిస్టం అలాంటిది. ఆ సిస్టం పరిధుల్లో పనిచేస్తే అంతే జరుగుతుంది-" అన్నాడు బాస్

"ఆ పరిధుల్ని అధిగమించే అధికారాలు మీకున్నాయి సార్"- అన్నాను.

"అది నీ భ్రమ-" అన్నాడు బాస్.

"సార్ - నాది భ్రమ కాదని నిరూపించే యాక్షన్ ప్లాన్ మీకివ్వగలను-"

బాస్ నావంక అదోలా చూసి, "నువ్వే కాదు - చాలామందిచ్చారు నాకు యాక్షన్ ప్లాన్సు. కొందరైతే లీడర్ని డిస్మిస్ చెయ్యమన్నారు....." అన్నాడు.

"మీరు వారి మాట వినకండి సార్-" అన్నాను.

"నేను నీ మాటలు విన్నట్లే అందరిమాటలూ వింటాను. కానీ నిర్ణయం మాత్రం పూర్తిగా నాది. జరిగింది తప్పైనా ఒప్పైనా అందుకు ఎవరి పూచీ లేదు. అన్నింటికీ నేనే బాధ్యుణ్ణి-" అన్నాడు బాసు. నాకు గీతోపదేశం చేస్తున్న కృష్ణుడు గుర్తుకొచ్చాడు.

ఉన్నట్లుండి బాసుకు ట్రాన్సుఫరయింది.

"ఇంకో ఆఫీసును బాగుచెయ్యాలి. ప్రభుత్వం నా సమర్థతను గుర్తించింది. అందుకే ఈ ట్రాన్సుఫర్-" అన్నాడు బాస్ నాతో.

"ఈయనిక్కడుంటే ఈ ఆఫీసు నామరూపాలు లేకుండా నశించి పోతుందని మేము ప్రభుత్వానికి నమ్మకం కలిగించాం - అందుకే ఈ ట్రాన్సుఫర్-" అన్నాడో యూనియన్ లీడరు నాతో.

ఎవరి అహాలు వారివి. మనదేశంలో అహాలకున్న స్థానం మంచికి లేకపోవడం వల్ల ఇప్పుడున్న స్థాయిలో ఉన్నామని తరచుగా నాకు అనిపిస్తూండేది. అహాన్ని పక్కన పెట్టడం వల్లనేమో - అటు బాసూ, ఇటు యూనియన్ వాళ్ళూ కూడా - చాటుగా నా గురించి ఏమనుకున్నా ఎదురుగా గౌరవించేవారు. అయితే యూనియన్ వారిచేత ద్వేషించబడుతూ కేవలం బాసుకి మాత్రం అత్యంత ఆప్తుడిగా మసలుతూండే విశ్వం అంటే నాకు ప్రత్యేకమైన గౌరవముండేది. అతడు మిగతావారిలా కాక - ఏ పని చేసినా ఆఫీసు శ్రేయస్సు గురించే ఆలోచించేవాడు. అక్రమంగా లక్షలార్జించగల ఎన్నో అవకాశాలను పక్కకు నెట్టాడు. అందుకతణ్ణి మెచ్చుకుంటే, "నా భార్య నాలో దురాశను పెరగనివ్వదు. దురాశ కేన్సరు వంటిదంటుందామె. నా నిజాయితీ ఆమె కారణంగా వచ్చింది-" అనేవాడు. బాసు పలుమార్లు వేదికమీద విశ్వాన్నీ, విశ్వంభార్యనూ మెచ్చుకున్నాడు. ఆయన మెప్పు పొందిన వారిలో నిజమైన మెప్పుకు అర్హత కలిగినవారు వారిద్దరేనని నా నమ్మకం.

బాసు వీడ్కోలు వేడుకకు విశ్వం రాలేదు. ఇటీవల అతడి భార్యకు అనారోగ్యంగా ఉంటోంది. నిన్ననే టెస్టులు చేయించాడు. సరిగ్గా వీడ్కోలు నాడు టెస్టు రిపోర్టు వచ్చింది. విశ్వం భార్యకు కేన్సర్. అడ్వాన్స్ స్టేజిలో ఉంది. ఆమె బహుశా ఇంకో ఆర్నెల్లకు మించి బ్రతకదు. ఏ మందులూ ఆమెను కాపాడలేవు.

వీడ్కోలు తీసుకునే రోజున బాసుకు అసలు సిసలు కన్నీళ్ళొచ్చాయి. ఆయన నా వద్ద విశ్వం ప్రసక్తి తెచ్చి, "ఇంకా చదువు పూర్తికాని పిల్లలు. విశ్వానికిప్పుడే భార్య ఎంతో అవసరం. అందులోనూ అలాంటి భార్యలు అరుదు. హీ డిజర్వ్స్ ఏ బెటర్ ఫేట్-" అన్నాడు.

విశ్వం విషయంలో జరిగిందానికి నాకూ ఎంతో బాధగా ఉంది. అయితే కొన్ని సంవత్సరాలుగా ఆలోచనల్లో బాసునీ, దేవుణ్ణీ పోల్చుకుంటూ వస్తున్నానేమో, "సార్ - సత్ఫలితాలకు అర్హులైన వారు అన్యాయానికి గురవుతూంటే అన్నీ చేయగలిగుండీ ఏమీ చేయలేని అసహాయస్థితి మీది. దేవుడిదీ అదే సిస్టం అని నాకు అనిపిస్తోంది-" అన్నాను అప్రయత్నంగా.

అది బాసుకు వీడ్కోలు సందేశమో, మనదేశ భవిష్యత్తుకు సంకేతమో నాకూ తెలియదు. కానీ ప్రతిరోజా దినపత్రికల్లో ప్రతిపక్షానికీ, ప్రభుత్వానికీ జరుగుతున్న సమర సమాచారం మొదటి పేజీలో రావడానికీ నా అనుభవాలకీ ఏమైనా సంబంధముందేమోనని మాత్రం నాకు అనిపించింది. బాసులు బందులిస్తే దేవుడు వరదలిస్తాడు. ఎటొచ్చీ బాసు ప్రతిపక్షమా, ప్రభుత్వపక్షమా అన్నది తేల్చడం భేతాళ ప్రశ్నయితే - ఇద్దరినీ తరచుగా అటూ యిటూ చూసిన విక్రమార్కుడిగా - మౌనం వహించాల్సిన ప్రశ్నే అయి ఉంటుంది. *